క్లుప్తంగా

గ్రామ స్వచ్ఛతలో భాగస్వామ్యం కావాలి



ప్రత్తిపాడు: గ్రామ స్వచ్ఛతలో ప్రజలను భాగస్వాములను చేయాలని జిల్లా పంచాయతీ అధికారి బీవీ నాగసాయి కుమార్ అన్నారు. మండల పరిధిలోని తుమ్మలపాలెంలో మంగళవారం ఆయన పర్యటించారు. తొలుత సుప్రీం ఎల్‌టీసీ సెంటరు (ఎస్‌డబ్ల్యూపీసీ)లోని నాడెప్ యూనిట్ల వినియోగం, తడి చెత్త, పొడి చెత్త వేరు చేసే పద్ధతి, వర్మీ తయారీ పద్ధతులను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని అంతర్గత వీధుల్లో ఇంటింటికీ వెళ్లి గృహిణులు, గ్రామస్తులతో మాట్లాడారు. రోజూ చెత్త సేకరణకు వాహనం మీ ఇంటి వద్దకు వస్తుందా అని మహిళలను అడిగి తెలుసుకున్నారు. స్వచ్ఛతలో మీ భాగస్వామ్యం ఉన్నప్పుడే సత్ఫలితాలుంటాయని చెప్పారు. వెంట డీఎల్‌పీవో శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి షేక్ ఖాజా, క్లాప్‌మిత్రలు ఉన్నారు.

గుంటూరు జీపీఐ కార్యాలయం వద్ద ధర్నా రేపు



కాకుమాను: గుంటూరులోని జీపీఐ కార్యాలయం వద్ద గురువారం చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రామారావు పిలుపునిచ్చారు. ఈ ఏడాది రైతులు పండించి పొగాకును ప్రభుత్వం నేటికీ కొనుగోలు చేయలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం కాకుమాను, పెదనందిపాడు మండలాల్లో రైతు సంఘ నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ.. ఈ ఏడాది నల్లబర్లీ పొగాకును సాగు చేయండని ప్రోత్సహించిన జీపీఐ కంపెనీ, ఇతర కంపెనీలు, ప్రభుత్వం రైతులను పట్టించుకున్న దాఖలు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం నల్లబర్లీ రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రెండు మండలాల రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ట్రాక్టర్



పెదకాకాని: నిర్లక్ష్యపు డ్రైవింగ్ చేసి ట్రాక్టర్‌తో విద్యుత్ స్తంభాన్ని ఢీ కొన్న సంఘటన తక్కెళ్లపాడులో చోటు చేసుకుంది. పెదకాకాని మండలం తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన షేక్ బాబావలి మంగళవారం తన ట్రాక్టర్‌ను అతివేగంగా నడుపుతూ విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నారు. దీంతో ఆ స్తంభం రెండు ముక్కలై కింద పడిపోయింది. సమీపంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు వాపోయారు. సంఘటనా స్థలానికి విద్యుత్ సిబ్బంది చేరుకుని వివరాలు సేకరించారు. విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పెదకాకాని ఏఈ బ్రహ్మయ్య తెలిపారు. మద్యం మత్తులోనే డ్రైవింగ్ చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

అవినీతిపై ఉద్యమించాలి

లక్ష్మీపురం: ఆనందకరమైన జీవనానికి అవసరమైన వనరులు, అవకాశాలు, న్యాయం వంటి వాటిని సామాన్య జనానికి అందుబాటులో లేకుండా చేస్తున్న అభివృద్ధిని కబలిస్తున్న అవినీతిని అంతం చేయాలని సీనియర్ అధ్యాపకులు సిహెచ్.సుబ్బారెడ్డి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో మంగళవారం అవినీతిపై చర్చ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అవినీతి నిరోధక చట్టాల దారుణవైఫల్యానికి ప్రతీకలుగా లంచావతారులు ప్రతి చోటా విజృంభిస్తూనే ఉన్నారన్నారు. జీవన సంధ్య అధ్యక్షుడు సి.కృష్ణారావు, సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి పాల్గొన్నారు.

8న ప్రపంచ ప్రార్థనా దినోత్సవం

మంగళగిరి టౌన్: క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీన ప్రపంచ ప్రార్థనా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఇమ్మానియేల్ చర్చి పాస్టర్ రవి ప్రకాష్ తెలిపారు. మంగళగిరి నగర పరిధి పార్కు రోడ్డులోని ఇమ్మానియేలు చర్చిలో మంగళవారం క్యాపిల్ రీజియన్ పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రపంచ ప్రార్థనా దినోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. రవిప్రకాష్ మాట్లాడుతూ.. టిప్పర్ల బజారులోని షాదీఖానాలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు ప్రపంచ ప్రార్థనా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రపంచ శాంతి, యుద్ధాలు, ఉగ్రవాద నిర్మూలన వివిధ అంశాలపై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

ఏడాదిలో ఏం మార్చావ్ బాబు

- గ్రామాల్లో ఎక్కడికక్కడ నిలిచిపోయిన పురోగతి
- నిర్వీర్యమవుతున్న సచివాలయ వ్యవస్థ
- ఇదీ కూటమి ఏడాది పాలన
- నేడు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో 'వెన్నుపోటు దినం'

ప్రత్తిపాడు, పొన్నూరు: కూటమి సర్కారు అభివృద్ధికి వెన్నుపోటు పొడిచింది. సూపర్ సిక్స్ అమలు చేయకుండా సంక్షేమానికి సంకెళ్లు విధిస్తోంది. ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేస్తోంది. కర్షకులకు సేవలందించాల్సిన రైతు సేవ కేంద్రాలు నిస్సహాయ కేంద్రాలుగా దర్శనమిస్తున్నాయి. గత ప్రభుత్వంలో మొదలైన పలు అభివృద్ధి కట్టడాలు కూటమి ప్రభుత్వం గద్దెనెక్కడంతో ఎక్కడిపనులు అక్కడే నిలిచిపోయాయి. మొండిగోడలు కూటమి ప్రభుత్వ పాలనను వెక్కిరిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వం పూర్తి చేసిన భవనాలను సైతం వినియోగంలోనికి తీసుకురాకుండా ప్రజలపై పగబట్టినట్లు ప్రభుత్వ పెద్దలు వ్యవహరిస్తున్నారు. దీంతో ఏడాది కూటమి ప్రభుత్వం ప్రజలకు ఎన్నికల హామీలతో వెన్నుపోటు పొడిచింది. దీనిపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బుధవారం వెన్నుపోటు దినం నిర్వహించనుంది.

వెక్కిరిస్తున్న మొండిగోడలు..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మొదలైన ప్రభుత్వ భవనాల నిర్మాణాలు కూటమి రాకతో పడకేశాయి. ప్రత్తిపాడులో రూ.18 లక్షల వ్యయంతో నిర్మించిన బల్క్‌మిల్క్ సెంటరును పూర్తి చేయకపోవడంతో పాల చుక్కలతో నిండాల్సిన బల్క్ మిల్క్ సెంటర్ మద్యం సీసాలతో దర్శనమిస్తున్నాయి. రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవన నిర్మాణం దాదాపుగా 90 శాతం పూర్తయ్యింది. మిగిలిన 10 శాతం పూర్తి చేసి వినియోగంలోనికి తీసుకురాకపోవడంతో పశువులకు నిలయంగా మారింది. రూ.17.50 లక్షల వ్యయంతో నిర్మించిన హెల్త్ వెల్‌నెస్ సెంటరు భవన నిర్మాణ పనులు పూర్తికాకపోవడంతో ప్రిస్క్రిప్షన్ పేపర్లు ఉండాల్సిన హెల్త్ వెల్ నెస్ సెంటరులో పేక ముక్కలు ఎగిరెగిరి పడుతున్నాయి. రూ. 21.80 లక్షలతో నిర్మించిన రైతు సేవ కేంద్రం మొండిగోడలతో వెలవెలబోతోంది.



మొండిగోడలతో రైతు సేవ కేంద్రం, హెల్త్ వెల్‌నెస్ సెంటర్, సచివాలయ భవనాల సముదాయం



హెల్త్ వెల్‌నెస్ సెంటరులో పేక ముక్కలు

నిర్మించినా ప్రారంభించకుండా..

కోయవారిపాలెంలో సుమారు రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనం నిర్మాణం ఎన్నికలకు కొద్ది రోజుల ముందు దాదాపుగా పూర్తయ్యింది. కానీ భవనాన్ని వినియోగంలోనికి తీసుకురాకుండా అధికారులు అలసత్వం వహిస్తుండటంతో ఆవరణ అంతా పిచ్చి చెట్లు, ముళ్ల కంపలతో నిండిపోయాయి. రూ.6 కోట్లతో అభివృద్ధి చేస్తున్న ప్రత్తిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం పనుల్లో నత్తే నయం అనిపిస్తుంది.



వైఎస్సార్‌సీపీ పోరుబాట..

వైఎస్సార్‌సీపీ ప్రజల పక్షాన పోరాడేందుకు సిద్ధమయ్యింది. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం వెన్నుపోటు దినంను నిర్వహిస్తుంది. ప్రజలను మోసగించడం, వెన్నుపోటు పొడిచి గద్దెనెక్కడాన్ని నిరసిస్తూ ప్రత్తిపాడులో వైఎస్సార్‌సీపీ శ్రేణులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. స్థానిక వైఎస్సార్ కాంస్య విగ్రహం నుంచి నిరసన ర్యాలీగా బయలుదేరి తహసీల్దార్ కార్యాలయం వరకు వెళ్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందించనున్నారు.

కూటమి పాలనపై ప్రజల్లో అసంతృప్తి



కూటమి పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఎన్నికలకు ముందు ఓట్ల కోసం ప్రజలను మభ్యపెట్టేందుకు మేనిఫెస్టో ద్వారా ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. మహిళలకు ఇచ్చిన వాగ్దానాలను ఏ ఒక్కటీ అమలు చేయలేదు. సంక్షేమ పథకాల కోసం ఎదురు చూసిన ప్రజలకు నిరాశే మిగిలింది. ఈ పాలకులకు ఎందుకు ఓటేశామా అనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

– డాక్టర్ నల్లమోతు రూత్ రాణి,
వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు, మాజీ చైర్‌పర్సన్, పొన్నూరు

అక్రమ కేసులే లక్ష్యంగా కూటమి పాలన..



ఏడాది పూర్తి చేసుకున్న కూటమి పాలనలో ప్రజలకు చేసిన మేలు ఏమాత్రం కనిపించలేదు. ప్రజలకిచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేసిన దాఖలాలు లేవు. వ్యక్తిగత కక్షలు, అక్రమ కేసులతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ పాలకులు కాలం వెళ్లదీశారు. కూటమి పాలకులకు ప్రజల్లోకి వెళ్లేందుకు ముఖం చెల్లడంలేదు. ఇలాంటి ప్రభుత్వాన్ని ఇంకా నాలుగేళ్లు చూడలేమనే ఆవేదన ప్రజల్లో వ్యక్తమవుతోంది.

– ఆకుల వెంకటేశ్వరరావు,
మాజీ మార్కెట్ యార్డు చైర్మన్, పొన్నూరు

కూటమిపై ప్రజల ఆవేదన..



కూటమి నాయకులు ఎన్నికల ప్రచారంలో గత ప్రభుత్వం కంటే మెరుగైన సంక్షేమ పథకాలు అందిస్తామని ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చి ఇప్పుడు వాటి ఊసే ఎత్తడంలేదు. మహిళలకు ఉచిత బస్సు కనబడటం లేదు. ఆరోగ్యశ్రీ నిర్వీర్యం చేశారు. రైతులకు సాయం అందించడంలో పూర్తిగా విఫలం. మాజీ సీఎం వైఎస్ జగన్ పాలనలో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారు. ఈ ప్రభుత్వాన్ని నమ్మి మోసపోయామని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

– అంబటి వెంకటేశ్వరరావు,
వైఎస్సార్‌సీపీ నాయకులు, పొన్నూరు

విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలి

కాకుమాను: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు రోజూ మంచి పౌష్టికాహారాన్ని అందించాలని ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ అన్నారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో మంగళవారం మధ్యాహ్న నిర్వాహకులకు వంటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కెనడీ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే ప్రతి విద్యార్థికి మంచి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలనే లక్ష్యంతో మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎంపీడీఓ యుగకీర్తి మాట్లాడుతూ.. పాఠశాలలు ప్రారంభం రోజు నుంచి ప్రతి రోజు విద్యార్థుల సౌకర్యార్థం సన్నబియ్యాన్ని అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వంటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో సీఆర్పీలు, కార్యాలయ సిబ్బంది, మధ్యాహ్న భోజన నిర్వాహకులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ

'వెన్నుపోటు దినం' జయప్రదం చేయండి

ప్రత్తిపాడు: కూటమి ప్రభుత్వ పాలన ఏడాది గడుస్తున్నా నేటికీ ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడుస్తుందని వైఎస్సార్‌సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్ అన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు బుధవారం నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో 'వెన్నుపోటు దినం' నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం బలసాని ప్రత్తిపాడులో పర్యటించారు. స్థానిక పార్టీ నాయకులతో కలిసి వైఎస్సార్ కాంస్య విగ్రహం వద్ద కార్యక్రమం ఏర్పాట్లను పరిశీలించారు. మండల పార్టీ అధ్యక్షుడు చల్లా హనుమంత్ యాదవ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: వెన్నుపోటు దినంను జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు చల్లా హనుమంత్‌యాదవ్ పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం గద్దెనెక్కి ఏడాది గడుస్తున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసపూరితంగా వ్యవహరిస్తుండటాన్ని నిరసిస్తూ బుధవారం 'వెన్నుపోటు దినం' పేరుతో నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చారు. మండలంలోని అన్ని గ్రామాల పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని హనుమంత్‌యాదవ్ కోరారు.

గుంటూరు రూరల్: వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ప్రత్తిపాడు నియోజకవర్గం ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం జరిగే కార్యక్రమాలను ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతున్నామన్నారు.



ఏర్పాట్లుపై నాయకులతో చర్చిస్తున్న బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు చానల్‌కు మరమ్మతులు చేపడతాం

పెదకాకాని: గుంటూరు చానల్‌పై నిర్మించిన వంతెనకు మరమ్మతులు చేపడతామని ఇరిగేషన్ ఏఈ అవినాష్ తెలిపారు. పెదకాకాని గ్రామం నుంచి గోళ్లమూడి వెళ్లే రోడ్డులో గుంటూరు చానల్(కొత్త కాలువ)పై నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరింది. దీంతో పెదకాకాని గ్రామానికి చెందిన వసంతరావు, పలువురు రైతులు ఉన్నతాధికారులను కలిసి ఫిర్యాదు చేశారు. అలానే ఈ వంతెన వద్ద నీటి నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన లాక్ సిస్టమ్ డోర్లు కూడా దెబ్బతిన్నాయని వారు తెలిపారు. శిథిలావస్థకు చేరిన వంతెనకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరడంతో మంగళవారం ఇరిగేషన్ ఏఈ వంతెన వద్దకు చేరుకుని పరిశీలించారు. త్వరలోనే పనులు చేపడతామని ఏఈ స్థానిక రైతులకు తెలిపారు.



శిథిలావస్థలో గుంటూరు చానల్

గోవధ నిషేధాన్ని కఠినంగా అమలు చేపట్టాలి

గుంటూరు ఎడ్యుకేషన్: బక్రీద్ సందర్భంగా గోవులను వధించకుండా ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని విశ్వహిందూ పరిషత్ ఉత్తరాంధ్ర ప్రాంత గోసంరక్షణ సహ ప్రముఖ్ మన్నవ చలపతిరావు కోరారు. మంగళవారం పాత గుంటూరు, సంగడిగుంట, లాల్‌పురం, కేవీపీ కాలనీ ప్రాంతాల్లో వీహెచ్‌పీ కార్యకర్తలు, బ్రాహ్మణ సంఘాలు, స్వచ్ఛంద సంస్థలతో కలిసి పర్యటించారు. కార్యక్రమంలో గౌడ్ సంరక్షణ విభాగ్ జిల్లా ప్రముఖులు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, దమ్మాలపాటి శ్రీనివాసరావు, ఆముదాల వెంకట్రావు, వీరంకి వీరబాబు, వి.సత్యనారాయణ, బుర్రి సుబ్బారావు పాల్గొన్నారు.



గోరక్ష విభాగ్ ప్రతినిధులతో చలపతిరావు, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసరావు తదితరులు

గ్రీన్ గుంటూరు పోస్టర్ల ఆవిష్కరణ

నెహ్రూ నగర్: అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గ్రీన్ గుంటూరు లక్ష్యంగా నగరంలో 5 లక్షలు మొక్కలు నాటడానికి వార్డ్ సచివాలయాల వారీగా ప్రజలను భాగస్వాములను చేస్తామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఈ నెల 5వ తేదీన అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పర్యావరణం, ప్లాస్టిక్ నిషేధంపై రూపొందించిన పోస్టర్ ఆవిష్కరణ కమిషనర్ చాంబర్‌లో మంగళవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వనమహోత్సవం స్ఫూర్తితో నగరంలో ఆరోజు 25 వేలు నాటేలా, ఈ విధంగా మొత్తం 5 లక్షల మొక్కలు నాటేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని వివరించారు. నగరంలో ప్లాస్టిక్ సంచుల నిషేధంలో భాగంగా ప్రజలకు ప్రత్యామ్నాయంగా రూ.20లకే గుడ్డ సంచులను ఇచ్చే మెషిన్లను అందుబాటులోకి తీసుకురానున్నామని పేర్కొన్నారు. గుంటూరు నగరాన్ని క్లీన్, గ్రీన్ నగరంగా తీర్చిదిద్దుకోవడానికి మొక్కల పెంపకం, ప్లాస్టిక్ నిషేధం కీలకమని, ఆయా కార్యక్రమాల్లో నగర ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార, వాణిజ్య సంస్థలు సహకరించి, భాగస్వాములు కావాలని కోరారు. బుధవారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియం దగ్గర చేపట్టే మెగా యోగాలో పాల్గొనే వారు యోగా మ్యాట్‌లతో హాజరు కావాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, బి.శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ రాంబాబు, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, ఎంహెచ్‌ఓ డాక్టర్ రవిబాబు, ఉపా సెల్ పీఓ రామారావు, ఐటీసీ నారాయణ, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

ప్రత్యేక హోదా ఆంధ్రుల సంజీవని

లక్ష్మీపురం: ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక హోదా సంజీవిని, హక్కు.. భిక్ష కాదు అని, విభజన చట్టంలో సెక్షన్ 46 కింద రాయలసీమకు, ఉత్తరాంధ్రకు బుందేల్ ఖండ్ తరహా ప్యాకేజీని కేంద్రం రాష్ట్రానికి ఇవ్వాలి కాని ఇవ్వలేదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీ ప్రభుత్వాలు రాష్ట్రానికి ద్రోహం చేశాయన్నారు. రాష్ట్ర విభజన సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం నవ్యాంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజీ, విభజన చట్టంలో వివిధ సెక్షన్ల క్రింద షెడ్యూళ్ల కింద రూ.5 లక్షల కోట్ల మేరకు వరాలు ఇచ్చిందన్నారు. బీజేపీ వీటిని అమలు చేయలేదన్నారు. ప్రస్తుతం టీడీపీపై ఆధారపడి కేంద్రం లోని బిజెపి ప్రభుత్వం మనుగడ సాగిస్తూ ఉంది. కనీసం ఇప్పుడైనా చట్ట ప్రకారం కేంద్రం నుంచి రాష్ట్రానికి రావలసిన వాటిని సాధించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొరివి వినయ్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గద్దం పాల్ విజయ కుమార్, పార్టీ జిల్లా అధ్యక్షుడు చిలకా విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి బిల్లా సునీల్, జొన్నా వెంకట్ రెడ్డి, కరీం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తులసిరెడ్డి

లైసెన్స్‌లపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో వార్డు సచివాలయాల వారీగా డీ అండ్ ఓ ట్రేడ్ లైసెన్స్‌లపై ప్రత్యేక దృష్టి చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. కమిషనర్ అమరావతి రోడ్, నగరాలు, పాత గుంటూరు, బాలాజీ నగర్, ఐపీడీ కాలనీ తదితర ప్రాంతాల్లో మంగళవారం పర్యటించారు. ఆ ప్రాంతాల్లో ట్రేడ్ లైసెన్స్‌లు, పారిశుద్ధ్య పనులు, పూడికతీత పనులను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రతి వ్యాపార, వాణిజ్య సంస్థ తప్పనిసరిగా నగరపాలక సంస్థ నుంచి డీ అండ్ ఓ ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండాలని చెప్పారు. వార్డు సచివాలయాల వారీగా శానిటేషన్ కార్యదర్శులు నూరు శాతం ట్రేడ్ లైసెన్స్‌లు ఉండేలా చర్యలు తీసుకోవాలని, అలాగే ట్రేడ్ రెన్యువల్ ఫీజులు చెల్లించేలా చూడాలని ఆదేశించారు. రోడ్లు, డ్రెయిన్లను ఆక్రమణలు చేసుకొని, ట్రాఫిక్, మురుగు పారుదలకు అడ్డంకిగా ఉన్న వాటిని పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య అధికారులు సమన్వయం చేసుకొని తొలగించాలని సూచించారు. వర్షాల వలన విరిగిన చెట్ల కొమ్మలు ఇంకా రోడ్ల పక్కన ఉంటున్నాయని, వాటిని తొలగించాలన్నారు. మేజర్ డ్రెయిన్లలో జరుగుతున్న పూడికతీత సమగ్రంగా జరిగేలా డీఈఈలు, ఈఈలు పర్యవేక్షణ చేయాలని, పూడికతీత అనంతరం మురుగు పారుదల పక్కాగా లేకుంటే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. పర్యటనలో కార్పొరేటర్ సంకూరి శ్రీనివాసరావు, ఈఈ కోటేశ్వరరావు, డీఈఈ రమేష్ బాబు, ఎస్ఎస్‌లు రాంబాబు, సోమశేఖర్, ఏఈలు, టీపీఎస్‌లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొనారు.



వ్యాపారులతో మాట్లాడుతున్న కమిషనర్

నేడు మెగా యోగా కార్యక్రమం

జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన యోగాంధ్ర 2025లో భాగంగా బుధవారం నగరపాలక సంస్థ పరిధిలోని ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియం ఎదురు రోడ్‌లో మెగా యోగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికార యంత్రాంగ, స్వచ్ఛంద సంస్థలు, స్టేక్ హోల్డర్స్ పాల్గొంటారని చెప్పారు.

మండలానికి నూతన ఉపాధ్యాయులు

ప్రత్తిపాడు: సాధారణ బదిలీల్లో భాగంగా మండలంలోని 5 మోడల్ ప్రైమరీ స్కూల్స్‌కు నూతన ఉపాధ్యాయులను ఉన్నతాధికారులు కేటాయించినట్లు మండల విద్యాశాఖాధికారి సీహెచ్ రమాదేవి మంగళవారం తెలిపారు. చినకాకాని హైస్కూల్ నుంచి కె.పద్మావతిదేవి నడింపాలెం హెచ్‌డబ్ల్యూ పాఠశాలకు.. నాదెండ్ల హైస్కూల్ నుంచి ఎల్.సాంబశివరావు చిన కోండ్రుపాడు మెయిన్ పాఠశాలకు.. పెదనందిపాడు హైస్కూల్ నుంచి ఎస్.ఉషారాణి తుమ్మలపాలెం ఎంపీయూపీ స్కూల్‌కు.. తుళ్లూరు హైస్కూల్ నుంచి డి.శీలా పెదగొట్టిపాడు ఎల్ఈ పాఠశాలకు.. అనంతవరప్పాడు హైస్కూల్ నుంచి మొహమ్మద్ ఎండీ గౌస్ వంగిపురం బీఎఫ్ఎస్ పాఠశాలకు రానున్నట్లు ఎంఈవో తెలిపారు.

కౌమార దశలో మానసిక వికాసం

ప్రత్తిపాడు: కౌమార దశలో కిశోర బాలికల్లో మానసిక వికాసం, సాంఘిక పరిణక్వత వేగంగా వృద్ధి చెందుతుందని ఐసీడీఎస్ ప్రత్తిపాడు సెక్టార్ సూపర్‌వైజర్ ఎస్.భారతి అన్నారు. నియోజకవర్గ కేంద్రంలోని యాదవపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం కౌమార బాలికల నాయకత్వం, సాధికారతపై కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కిశోర బాలికలు ఎదిగే క్రమంలో ఎదురయ్యే అన్ని రకాల సమస్యలను సమర్థవంతంగా అధిగమించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు నాసరమ్మ, నగరాజకుమారి, వెంకాయమ్మ, ఎంఎస్‌కే ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

పెదకాకాని: పెదకాకాని సబ్‌స్టేషన్‌లో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ బ్రహ్మయ్య మంగళవారం తెలిపారు. పెదకాకాని సుందరయ్య కాలనీ, బాజీ బాబా దర్గా, గౌడ్ పాలెం, సదాశివయ్య కాలనీ, వెనిగర్ల రోడ్డు, తోట బైబిల్ మిషన్ ప్రాంతం, జ్యోతి నగర్, అంబేడ్కర్ నగర్, గవర్నమెంట్ హాస్పటల్ రోడ్డు ఏరియా, పొట్టి శ్రీరాములు వారి వీధి ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని.. వినియోగదారులు సహకరించాలని డీఈ పీహెచ్ ఖాన్ కోరారు.

కాకుమాను: విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా పెదనందిపాడు మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఆ శాఖ ఏఈ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని అబ్బినేనిగుంటపాలెం, జీజీ పాలెం, రావిపాడు, గోగులమూడి గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

గుంటూరు రూరల్: విద్యుత్ సబ్‌స్టేషన్ల మరమ్మతుల నేపథ్యంలో బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు డీ 12 సెక్షన్ పరిధిలోని నాయుడుపేట 11కేవీ, వార్త 11కేవీల పరిధిలోని సబ్‌స్టేషన్ల మధ్య గల లైన్ల మరమ్మతుల నిమిత్తం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ పొత్తూరు, ఓబులునాయుడుపాలెం, నాయుడుపేట, లింగాయపాలెం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని అన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పట్నంబజారు: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాలు.. మంగళగిరి కొత్తపేటకు చెందిన గోర్ల భరత్(39) టూరిస్టు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మే నెలలో 20 మంది టూరిస్టులను కాశీ తీసుకెళ్లి తిరిగి వస్తున్న సమయంలో ఒడిశా వద్ద ప్రమాదం చోటుచేసుకుంది. అక్కడి నుంచి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి భార్య పేరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.